## కథ

-డా. డబ్బీరు శివకుమార్

# వైజాగ్ బ్యూటీ-వైనాట్ నాటీ

**“అక్కా అక్కా! మన ఏకైక అమెరికా బావ రేపోమాపో వైజాగ్ వచ్చేస్తున్నాట్ట! ఎందుకో తెల్సా? మనిద్దర్నీ ఎగ్జామిన్ చేసి మనలో ఎవరు పెద్దో డిసైడ్ చేసి పెళ్ళి చేస్కుని అమెరికా తీస్కెళ్ళిపోడానికట” హైహీల్స్ టకటక లాడించుకుంటూ వచ్చి సంబరంగా చెప్తోంది రక్షిత.**

**“వస్తే రానీ కానీ నన్ను అక్కా అని పిలవొద్దని ఎన్నిసార్లు చెప్పాలే నీకు! నువ్వే నా అక్కవి. ఇంతకీ బావ మనల్ని ఎగ్జామిన్ చెయ్యడమేంటే ఛండాలంగా! ఏం ఎగ్జామిన్ చేస్తాట్ట” ఆ ఆలోచనకే బెంబేలెత్తిపోతూ కంగారుగా అడిగింది అక్షిత, అదోలా మొహం పెట్టి.**

''బావేం చేస్తాడో ఎలా చేస్తాడో వచ్చాక తెలుస్తుందిగా. అంత తొందరెందుకే నీకు?'' చిలిపిగా కన్నుకొట్టి వెళ్ళిపోయింది రక్షిత.

మర్నాడే ఫ్లైట్‌లో వైజాగ్ చేరాడు రవిచంద్ర. ఆరడుగుల పర్సనాల్టీ. విశాలమైన కళ్ళూ, ముట్టుకుంటే కందిపోయే ఒళ్ళూ, చెరగని చిరునవ్వూ.. అతన్ని చూసిన ఓ ఆడపిల్లకీ అంత ఈజీగా అతన్ని వదులుకోవాలనిపించదు.

రవిచంద్ర తండ్రి ధర్మారావు ఎక్కువగా నార్త్‌లో ఉద్యోగం చెయ్యడం, ఎప్పుడో చిన్నప్పుడు తప్ప రవిచంద్ర వైజాగ్‌లో ఉన్న తన మేనమామ ప్రతాపరావు ఇంటికి పెద్దగా వెళ్ళింది లేదు. కాన్పూర్‌లో ఐఐటీ కాగానే అమెరికా ఆఫర్ వచ్చి నాలుగేళ్ళుగా అక్కడే ఉండిపోవడంతో, వయసొచ్చిన మరదళ్ళ స్వరూప స్వభావాలూ, యౌవన విభవాలూ గమనించే ఛాన్స్ ఇప్పుడే దొరికింది రవిచంద్రకి.

ప్రతాపరావుగారి ఇద్దరు కవల ఆడపిల్లలూ ఓ చీకటి రాత్రి నిమిషాల తేడాలో పుట్టడం, ఆ కంగార్లో పురుడుపోసిన పక్కింటి పిన్నిగారు కూడా ఎవరు ముందు పుట్టారో చెప్పలేకపోవడంతో ఆ అమ్మాయిలిద్దర్లో ఎవరు పెద్ద అన్నది ఇప్పటికీ మిస్టరీగానే ఉండిపోయింది. చిన్నప్పుడంతా నేను అక్కనంటే నేను అక్కనని పోట్లాడుకున్న ఆ కవలలిద్దరూ, పెద్దయ్యాక, నేను చెల్లినంటే నేను చెల్లినని కొట్లాడుకుంటున్నారు.

''బావా! మా ఇద్దరమ్మాయిల్లో రవిచంద్ర మనసుకి ఎవరు బాగా నచ్చితే అదే పెద్దదానికింద లెఖ్ఖేసి దాన్ని రవిచంద్రకిచ్చి పెళ్ళి చేసేద్దాం. తరవాతే రెండో పిల్లకి సంబంధం చూస్తాను, ఏమంటావ్?'' అన్న ప్రతాపరావుగారి ఐడియాని ''బ్రహ్మాండం'' అంటూ ఓకే చేసేశారు ధర్మారావుగారు. ఆ సెలెక్షన్ కోసమే ఇప్పుడు రవిచంద్ర వైజాగ్ రావడం.

''ఇదిగో ఇదే మా గడుగ్గాయ్ రక్షిత. కబుర్లపోగు. డ్రెస్సూ, థింకింగూ అంతా మోడ్రనే. చీర కట్టమంటేనే చిర్రెత్తుతుంది దీనికి'' కూతురు పోనీటైల్ మీద మురిపెంగా తడుతూ పరిచయం చేశారు ప్రతాపరావుగారు.

'అమెరికా లైఫ్‌స్టైల్‌కి అదిరేలా సూటవుతుంది' క్రీమ్ కలర్ టీషర్ట్, బ్లాక్ జీన్స్‌లో యౌవన కెరటంలా దూసుకొస్తున్న రక్షితని ఆబగా చూస్తూ అనుకున్నాడు రవిచంద్ర.

''హాయ్ బావా! అంత పొడుగైపోయావేంటీ! పొట్లకాయలు బాగా తినేవాడివా చిన్నప్పుడు'' తొలిపరిచయంలోనే దూకుడుగా వాగేస్తున్న రక్షిత స్పీడ్‌కి డంగైపోయాడు రవిచంద్ర.

''అదిగో! ఆ వస్తున్నదే అక్షిత. పాటలు బాగానే పాడుతుంది గానీ మాటలే అట్టే రావు పాపం'' చిరునవ్వుతో అంటున్నారు ప్రతాపరావుగారు.

జడలో మల్లెలూ మరువాలూ, పట్టులంగా వోణీల మాటున గుట్టుగా దాచిన పరువాలూ.. బెట్టుగా నడిచి వస్తున్న అక్షితని కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయేడు రవిచంద్ర. తెలుగుదనం ఉట్టిపడే ఇలాంటి చక్కదనాల చుక్కతో 'ఏ దేశమేగినా' ఇండియామీద బెంగే ఉండదు. ముచ్చటగా అనుకున్నాడు.

మరదళ్ళిద్దర్నీ స్టడీ చెయ్యడంలో కాలం తియ తియ్యగా గడిచిపోతున్నా మహా కన్ఫ్యూజన్‌గా ఉంది రవిచంద్రకి. రక్షిత, మనసుని వేడెక్కించే ఉదయపు కాఫీలాంటిదైతే, అక్షిత మదిని చల్లబరిచే మిట్టమధ్యాహ్నపు కొబ్బరినీరు. ఉరకలెత్తించే ఉత్సాహం రక్షిత ఐతే, ఉన్మత్తుణ్ణి సైతం ఉదాత్తుణ్ణి చేసే ఉల్లేపనం అక్షిత. పోలికల్లో తేడాలున్నా సోయగాల్లో ఇద్దరూ ఒకరికొకరు పోటీలే. ఎవర్ని కాదనాలన్నా మనసొప్పడం లేదు. అసలే మొహమాటస్థుడైన రవిచంద్ర- 'పోనీ! ఇద్దర్నీ చేసేస్కుంటే' మామయ్య ఫీలవుతాడేమో! పోనీ మరదళ్ళనే అడిగేస్తే, ఎవరికి బాగా నచ్చానో. మనసు పరిపరి విధాల పోతోంది. మాగిన బొబ్బట్లూ..వేడి వేడి పెసరట్లూ ఎదురుగా పెట్టి ఏదో ఒకటే సెలెక్ట్ చేస్కోమంటే ఎలా? సతమతమైపోతున్నాడు రవిచంద్ర, ఆలోచనల్తో.

ఆరోజు ఉదయం..నెమలికంఠం రంగు

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన**

నేత చీరలో, మ్యాచింగ్ బ్లౌజ్, రెండు చేతుల నిండా మట్టిగాజుల్తో, తలనిండా జాజుల్తో రవిచంద్ర గదిలోకి అడుగు పెట్టింది అక్షిత. 'ఐ లవ్యూ చెప్పడానికేమో!' ఆశగా చూశాడు రవిచంద్ర.

''నువ్వు రక్షితనే పెళ్ళి చేస్కో బావా!'' తీర్పుచెప్తున్న జడ్జిలా కరాఖండిగా చెప్పేసింది.



హతాశుడయ్యాడు రవిచంద్ర. 'ఇంకా నా సెలక్షన్ పూర్తి కానిదే!' అనుకుంటూ-''ఏం నేన్నీకు నచ్చలేదా!'' అహం దెబ్బతిన్న మొహం పెట్టి అన్నాడు.

''నీకేం బావా! అమెరికా వెళ్ళొచ్చిన అన్నమయ్యలా ఉంటావు. నీలాంటి భర్త దొరకడం ఏ ఆడపిల్లకైనా అదృష్టమే. అందుకే...ఆ అదృష్టం రక్షితక్కకే దక్కాలి. అదంటే నాకు ప్రాణం'' అనేసి మొహం దించుకుని వెళ్ళిపోతున్న అక్షితకేసి గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయేడు రవిచంద్ర, 'అక్కా చెల్లెళ్ళ ప్రేమంటే ఇలా ఉంటుందా! ఇదేం త్యాగంరా బాబూ!' అనుకుంటూ.

అదేరోజు సాయంత్రం స్లీవ్‌లెస్ టాప్, మినీస్కర్ట్‌లో మన్మధబాణంలా బావ గదిలోకి దూసుకొచ్చింది రక్షిత.

''ఏం బావా! క్యాండేట్ సెలెక్షన్ పూర్తయిందా! లేకపోతే ఇలాగే బావుందని మా ఇద్దరికీ లైనేస్తూ గడిపేద్దామనుకుంటున్నావా!'' చిలిపిగా అంటూ ఎదురుగా ఉన్న సోఫాలో కాలుమీద కాలేస్కుని కూర్చుని విలాసంగా కాళ్ళూపుతూ రవిచంద్రకి గంగవెర్రులెత్తిస్తోంది. ''అబ్బె! లె..లె..లె.. లేదు'' తడారిపోతున్న గొంతుతో చూపు మరల్చుకుంటూ అన్నాడు రవిచంద్ర.

''సరేగానీ ఏంటీ పొద్దున్నే అక్క నీతో మంతనాలాడ్తోంది. తననే చేస్కోమంటోందా?'' ఆరాగా అడిగింది రక్షిత.

''ఛీ..ఛీ..అదేం కాదు. నన్ను నీకు త్యాగం చేసి పారేసి వెళ్ళిపోయింది. ఏం! నువ్వు కూడా అదే పనిమీద వచ్చావా!'' ఎగతాళిగా అన్నాడు రవిచంద్ర.

''లేదు బావా. నాకూ మా అక్షితంటే బోల్డు ఇష్టం. అందుకే నిన్ను నేనే చేస్కోవాలన్న నిర్ణయానికొచ్చాను. అది మాత్రం త్యాగం కాదూ'' అనేసి కొంటెగా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

'అంటే..నన్ను చేస్కోవడం, త్యాగమా!' రవిచంద్రకి ట్యూబ్‌లైటు వెలగడమే లేటు..వెలిగిందా మహా బ్రైటు..'చేస్కుంటే ఇలాంటి కొంటె కోణంగినే చేస్కోవాలి. ముక్కుకి తాడెయ్యాలి' ఇంటర్వల్ ముందు సిన్మా హీరోలా మీసం మెలేస్తూ అనుకున్నాడు రవిచంద్ర. అంతలోనే మనసులోని మరోగది లోంచి బాధగా ఓ మూలుగు! 'మరి పాత సిన్మాలో సావిత్రిలా బుద్ధిగా బొద్దుగా ఉండే అక్షిత మాటేం చేస్తావ్' అంటూ.


ఎటూ తేల్చుకోలేని సందిగ్ధంలో కాస్త డైవర్షన్ కోసమని టీవీ ఆన్ చేసి కూర్చున్నాడు రవిచంద్ర.

'ఫోను కొట్టు ప్రైజ్ పట్టు' ప్రోగ్రాంలో అచ్చ తెలుగుని పచ్చిగా ఖూనీ చేస్తూ అష్టవంకర్లు తిరిగిపోతూ 'కాలర్స్'తో బాతాఖానీ

వేస్తున్న ఆ యాంకర్ని చూడగానే 'వార్నీ! నువ్వా' అనుకుంటూ జేబులోంచి సెల్ తీశాడు. ఆ యాంకర్ ఎవరో కాదు. రవిచంద్రకి బాల్యమిత్రుడు కమ్ దూరపు చుట్టం గౌరీశంకర్‌గాడే. పది పన్నెండుసార్లు రింగ్ ఇచ్చి విసుగొచ్చి సెల్ విసిరేద్దామనుకుంటుండగా ఠక్కున కనెక్టయ్యింది కాల్.

''ఈ వారం లక్కీ కాలర్ ఎవరో ఛూద్దామా! హెల్లో! దిసీజ్ 'శంకర్ ద యాంకర్' ఫ్రమ్ ఫోనుకొట్టు ప్రైజ్ పట్టూ..'' అంటూ చేతులూ కాళ్ళూ ఊపేస్తూ మెలికలు తిరుగుతున్న గౌరీశంకర్‌ని 'లైవ్'లో కాసేపు ఏడిపించాలనే చిలిపి కోరిక కలిగింది రవిచంద్రకి.

''లక్కీ కాలర్ కాదురా ఎదురుగా రారా నీ చొక్కా కాలర్ పట్టుకుంటా!'' కోపం నటిస్తూ అన్నాడు రవిచంద్ర.




గతుక్కుమన్న శంకర్ ద యాంకర్ ''ఎక్కణ్నుంచి కాల్ చేస్తున్నారు మీరూ!'' తడబడ్తూ అడిగేడు వెర్రి నవ్వు నవ్వుతూ.

## అనుష్క కోరిక

**అందాల తార అనుష్కకి ఓ కోరిక వుందిట. అదేంటంటే- ఓ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రని పోషించాలనిట. నటించాలేగానీ ఎన్నో రకాల పాత్రలుంటాయి. అలా అన్ని రకాల పాత్రల్ని పోషించి మెప్పించాలి అనే అభిప్రాయం గల అనుష్కకి ఈ పోలీస్ పాత్ర మాత్రం కచ్చితంగా పోషించాలని బోల్డు ఆశగా వుందని సెలవిస్తోంది. ఆమె కోరిక త్వరలోనే నెరవేరుతుందేమో చూడాలి!**



''ఈ రిమోటే రివాల్వరైతే ఇక్కణ్ణించే కాల్చేసేవాణ్ణిరా నిన్నూ! ఆ వంద్దనమాట లేంట్రా ఆడపిల్లలా!'' అన్నాడు రవిచంద్ర తానెవరో చెప్పకుండానే. మావోయిస్ట్ కాల్ అందుకున్న మినిస్టర్లా గజగజలాడినా ఆ గజగజల్ని తన మూమెంట్స్‌లో కలిపేస్తూ మరోసారి వెర్రి నవ్వు నవ్వేడు శంకర్. ''మీరేం అనుకోకపోతే మీ టీవీ వాల్యూం కాస్త తగ్గిస్తారా!'' ఏం అనాలో తోచనప్పుడు శంకర్ అనే రొటీన్ డైలాగ్ అది!

''వాల్యూలేని నీ వాగుడు వినడానికి వాల్యూం కూడా తగ్గించాల్రా! నేన్రా రవిచంద్రని. చిన్నప్పుడు, అనగా ప్యూపాదశలో ఉండగా హ్యాపీగా తిరిగేవాళ్ళం కదరా ఇద్దరం! ఆ తెలుగేంట్రా అమెరికాలో అప్పడాలమ్ముకునే వాడిలా! చిన్నప్పుడు తెలుగు పరీక్షలో డింకీలు కొట్టేవాడివి. అదే నీకిప్పుడు పెద్ద క్వాలిఫికేషన్ అయిపోయినట్టుంది'' గట్టిగా నవ్వుతూ రవిచంద్ర వేళాకోళమాడ్తుంటే గౌరీశంకర్‌కి ఎక్కడో కాల్తోంది.

''ఛూడండి రవిచంద్రగారూ! ఆ డిటైల్స్ అన్నీ ఇప్పుడంత అవసరమా! ఈ ప్రోగ్రాం లైవ్‌లో లచ్చల మంది ఉచ్చాహంగా వాఛ్ చేస్తున్నారని ఛెల్సుగదా మీకు'' 'అర్థం చేస్కోరా' అన్నట్టు హింట్ ఇచ్చేడు శంకర్ మరో మూడు వంకర్లు ఎక్స్‌ట్రాగా తిరుగుతూ.

''చిన్నప్పుడు అష్టవంకర్లు తిరుగుతూ మాట్లాడేవాడివని 'శంకర్ ద వంకర్' అని ఏడిపించే వాళ్ళం కదరా! అవన్నీ ఇప్పుడు పనికొస్తున్నాయన్నమాట నీకు!'' చనువుగా ఛడామడా వాగేస్తున్న రవిచంద్రని కంట్రోల్ చెయ్యడానికి వేరే మార్గం కనిపించక కాలికిందనే ఉన్న సీక్రెట్ బటన్‌ని కచ్చగా నొక్కి కాల్ కట్ చేసేశాడు శంకర్.


''అయ్యో! ఖాల్ ఖట్టయిపోయినట్టుంది!'' అనేసి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు ఆ పూటకి.


ప్రోగ్రాం అయిపోయాక తీరిగ్గా తనే రవిచంద్ర నెంబర్‌కి రింగ్ చేశాడు శంకర్. ''నువ్వెప్పుడు తగలడ్డావురా ఇండియాకీ!'' అంటూ.

''సర్లేగానీ నేనో అందమైన ప్రాబ్లంలో ఇరుక్కున్నాను. అర్జంటుగా వైజాగ్ వచ్చెయ్. నీతో చాలా చెప్పాలి'' అంటున్న స్నేహితుడు మాట కొట్టెయ్యలేక మర్నాటి ఫ్లైట్‌లో వైజాగ్ చేరేడు శంకర్ ద యాంకర్.

''టీవీలో అమ్మాయిల్తో సొల్లు కబుర్లాడ్డం కాదు నా ప్రాబ్లం సాల్వ్ చెయ్ ముందర!'' అంటూన్న రవిచంద్ర మాటల్ని తేలిగ్గా కొట్టి పారేస్తూ

''ఊరుకోరా! పిల్లని సెలెక్ట్ చేస్కోవడం కూడా పెద్ద ప్రాబ్లమారా నీకు! ఆటా, పాటా, వాకింగ్, టాకింగ్, సెక్సప్పీల్, బాడీలాంగ్వేజ్




అన్నిట్లో ఇద్దరికీ మార్కులు వెయ్యి. ఎవరెక్కువ స్కోర్ చేస్తే వాళ్ళనే చేస్కో'' సింపుల్‌గా తేల్చేశాడు.

''మరదే నీతో వచ్చింది. గత నాల్రోజులుగా నేను చేస్తున్నదే అది. అన్నిట్లోనూ ఇద్దరికీ ఈక్వల్ మార్కులే! కాకపోతే ఇద్దరివీ డిఫరెంట్ స్టైల్స్! ఇద్దరి స్టైల్సూ నాకు నచ్చేవే! ఏం చెయ్యాలి'' దీనంగా అన్నాడు రవిచంద్ర.

''మా నాయినే! పోనీ ఇద్దర్నీ చేస్కోరాదూ!'' శంకర్ ఎకసెక్కెంగా అంటూ ఉండగానే తుపాన్‌లా ఎంట్రీ ఇచ్చింది రక్షిత. ఆ వెనకే పిల్లతెమ్మెరలా అక్షిత.

''హాయ్! నువ్వు టీవీ యాంకర్ శంకర్‌వి కదూ!'' జూలో జంతువుని చూసినట్టు చూస్తూ రక్షిత కురిపిస్తున్న యక్ష ప్రశ్నలకి జవాబు చెప్పడానికి ఛాటర్ బాక్స్‌లాంటి శంకరే తడుముకోవాల్సొచ్చింది. చాలాసేపు అవాకులూ చెవాకులూ పేలేయి ఇద్దరి మధ్య! రవిచంద్ర, అక్షిత దాదాపు మౌన ప్రేక్షకులే అయ్యేరు.

అమ్మాయిలిద్దరూ అలా వెళ్ళగానే అన్నాడు శంకర్.

''నువ్వు చెప్తోంటే ఏంటో అనుకున్నాగానీ గొప్ప చిక్కులోనే పడ్డావురా! ఒక అమ్మాయి సైలెంట్ బ్యూటీ! ఇంకొక అమ్మాయి వయొలెంట్ నాటీ! ఇద్దరూ ఇద్దరే! సెలెక్షన్ టైటే!''

''నీ సింపతీ కాదురా నాక్కావల్సింది! సమస్యకి పరిష్కారం!'' విసుగ్గా అన్నాడు రవిచంద్ర.

''అదే ఆలోచిస్తున్నా'' అంటూ ఆ రాత్రంతా బోనులో ఎలకలా బాల్కనీ అంతా పచార్లు చేసి చేసి అలిసిపోయిన గౌరీశంకర్ సడన్‌గా గావుకేక వేశాడు 'యురేకా' అంటూ!

మర్నాడు సాయంత్రం గౌరీశంకర్ కోరిక మీద నలుగురూ కలిసి సిన్మాకెళ్ళే ప్రోగ్రాం ఏర్పాటైంది. 'నరుక్కుందాం రా!' టైటిల్ వింటూ ఛెంగున గెంతేసి ఒప్పుకుంది రక్షిత. ''అది వైలెన్స్ మూవీ అట వేరే సిన్మాకెళ్దాం'' అన్న అక్షిత మాటలు ఎవరూ పట్టించుకోలేదు.

అదొక ఫ్యాక్షన్ కమ్ యాక్షన్ మూవీ. బాంబుల ధమధమల్తో రౌడీల రంకెలతో హాలంతా దద్దరిల్లుతోంది. ఒత్తులే సరిగా పలకలేని హీరో చేతిలో విక్రమార్కుడి కత్తిలాంటి ఉత్తుత్తు కత్తీ, ఎదురొత్తులివ్వడం తప్ప వేరే పనేం లేనట్టున్న హీరోయిన్, కత్తుల్తో కుత్తుకలు కొయ్యడమే తన భాషంటున్న హిందీ విలన్‌లదే హడావిడి అంతా. ఒకవేపు హీరో, మరోవేపు విలన్ చిన్నా పొన్నా యాక్టర్లందర్నీ వరస పెట్టి నరుక్కుంటూ పోతున్నారు. తెగిపడుతున్న కాళ్ళూ, చేతులూ, హాహాకారాల్తో తెరంతా బీభత్సంగా ఉంది. అంతలో.. ఓ పదేళ్ళ కుర్రాడి తల దొర్లుకుంటూ నీళ్ళలో పడి నీళ్ళన్నీ ఎర్రగా మారిన జుగుప్సాకర దృశ్యం! ఆ దృశ్యం చూసి కాదు రవిచంద్ర గుడ్లు తేలేసింది ''అబ్బ! భలే నరుకుతున్నాడు కదు బావా! ఏం డైరెక్షన్! ఏం ఫొటోగ్రఫీ'' అంటూ కేరింతలు కొడ్తున్న రక్షిత ఆనందం చూసి.

''నీకలాంటి సీన్స్ నిజంగా ఇష్టమా!'' నమ్మలేనట్టు రక్షితని అడిగాడు రవిచంద్ర ఇంటికొస్తుండగా.

''మరి! అందుకేగా ఈ సినిమా సెలెక్ట్ చేసింది'' అంటూ రెక్‌లెస్‌గా నవ్వుతున్న రక్షిత రాక్షసిలా అనిపించింది ఆ క్షణంలో.

ఆ రాత్రే రవిచంద్ర ఇంటికి ఫోన్ చేసి తన నిర్ణయం చెప్పేశాడు. ఆ తర్వాత కొన్నాళ్ళకే అక్షిత, రవిచంద్రల ఎంగేజ్‌మెంట్ ఘనంగా జరిగిపోయింది. పిలవకపోయినా వచ్చి వాలిపోయాడు శంకర్ ద యాంకర్.

★ ★ ★

ఆ సాయంత్రం పెరట్లో గున్న మామిడి చెట్టు వెనకాల గుసగుసలాడుకుంటున్న జంటని పసిగట్టి వెనకాలే నక్కి చెవులు రిక్కించారు రవిచంద్ర, అక్షిత.

''సముద్రంలా గంభీరంగా ఉండే బావకి సెలయేరులా నెమ్మదిగా ఉండే అక్షితక్కే సరైన జోడీ అని బావని హర్ట్ చెయ్యకుండా ఎలా చెప్పాలో తెలియక, తనకిష్టమైన బావని నాకోసం త్యాగం చేసేసి, నేను కూడా తనకోసం అదే పని చేస్తున్నాననుకుని అపార్థం చేస్కుని బాధపడిపోతున్న అక్షితక్కని కన్విన్స్ చెయ్యలేకా సతమతమైపోతున్న నాకు వెదకబోయిన టీవీ ఛానెల్‌లా భలే దొరికావు శంకర్! నువ్విచ్చిన ఆ సలహా ఎంత బాగా వర్కవుట్ అయిందో! ఆ రోజు సిన్మాలో ఆ ఛండాలపు సీన్లు చూసి నేను కేరింతలు కొడ్తుంటే పాపం బావ మొహం చూడాలి!'' శంకర్ ఒళ్లో తలపెట్టుకుని పడుకుని నవ్వుతూ అంటోంది రక్షిత.

''పాపం! నా వల్ల మీ బావ దృష్టిలో లేడీ విలన్ అయిపోయావ్!'' గోముగా ఆమె ముంగురులు సవరిస్తూ అంటున్నాడు గౌరీశంకర్.

''టీవీలో నీ యాంకరింగ్ చూసే నీ ఫ్యాన్ అయిపోయా. అలాంటిది ఏకంగా మా ఇంట్లోనే లైవ్ ప్రోగ్రాం పెట్టేసి లైన్లో పెట్టేశావ్ నన్ను!'' శంకర్ బుగ్గ గిల్లుతూ అంటోంది రక్షిత.

''చూశారా! ఇందులో ఏదో తిరకాసుందీ మా రక్షిత మనసు బంగారం అని నేను చెప్పలేదూ అప్పుడే!'' అక్షిత గుసగుసలాడింది రవిచంద్రతో.

''వార్నీ! ప్రోబ్లమ్ సాల్వ్ చెయ్యరా అంటే ఇలా సాల్వ్ చేశాడా వీడు! వీళ్ళింకా ఎడ్వాన్స్ అవకముందే పెద్దవాళ్ళకి చెప్పి ఎంగేజ్‌మెంట్ ఏర్పాటు చెయ్యకపోతే డేంజరే!'' అన్నాడు రవిచంద్ర.

☆